క్లుప్తంగా

సి.కొత్తపల్లిలో మంచినీటి బోరు


కొబ్బరికాయ కొడుతున్న సర్పంచ్

పుల్లలచెరువు: మండలంలోని చాపలమడుగు పంచాయతీ సి.కొత్తపల్లిలో మంచినీటి సమస్య ఉండటంతో ఆ గ్రామ ప్రజలు సమస్యను సర్పంచ్ సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సర్పంచ్..ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు గ్రామంలో బోరు వేసేందుకు చర్యలు తీసుకున్నారు. బుధవారం బోరు వేశారు. గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కరించినందుకు ఎమ్మెల్యే చంద్రశేఖర్‌కు, సర్పంచ్ సత్యనారయణరెడ్డికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు సన్మానం


సన్మాన గ్రహీతలతో ఉపాధి సిబ్బంది

దొనకొండ: స్థానిక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మంచి పేరు తెచ్చుకుని బదిలీపై వెళ్లిన ఉద్యోగులను బుధవారం ఉపాధి సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఏపీఓ టి.దేవయ్య కురిచేడుకు, టీఏలు తోట నాయక్ దర్శి, హనుమానాయక్ తాళ్లూరు, స్వర్ణకుమార్ దర్శి, లక్ష్మణరావు కురిచేడుకు బదిలీపై వెళ్లారు. వారికి గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న సిబ్బంది పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ల అధ్యక్షుడిగా కేశవ


వల్లపునేని కేశవ

దొనకొండ: స్థానిక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్ల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వల్లపునేని కేశవ, ఉపాధ్యక్షుడిగా దయ్యాల బాలయ్య, కార్యదర్శిగా సత్యనారాయణరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సబ్‌స్టేషన్ పనులు శరవేగంగా పూర్తి చేయాలి

- విద్యుత్ శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు


సబ్‌స్టేషన్ పనులు పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

తాళ్లూరు: 132–33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు శరవేగంగా పూర్తి చేయాలని ఎస్ఈ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. మండలంలోని తూర్పుగంగవరంలో 132–33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చేపడుతుండగా ఆయన బుధవారం పరిశీలించారు. నాణ్యమైన విద్యుత్ మండల వాసులకు అందించేందుకు సబ్‌స్టేషన్ తోడ్పడుతుందన్నారు. దర్శి ఈఈ పి.శ్రీనివాసులు, ఏఈ వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పొలంలో వ్యక్తికి పాముకాటు

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని ఉల్లగల్లు గ్రామానికి చెందిన పర్వతనేని వీరాంజనేయులు బుధవారం పాముకాటుకు గురయ్యాడు. పొలంలో పశుగ్రాసం తెచ్చేందుకు వెళ్లగా గడ్డిలో పాము ఉండి వీరాంజనేయులును కాటేసింది. పొలంలో పశువులను మేపుకుంటున్న వారు గమనించి వీరాంజనేయులును హుటాహుటిన దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వేసవి దుక్కులే కీలకం

- సస్యరక్షణతోనే అధిక లాభాలు
- వ్యవసాయాధికారి నిర్మలాదేవి

పుల్లలచెరువు: వ్యవసాయంలో రైతులు సస్యరక్షణ చర్యలు పాటించినప్పుడే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చు. విచక్షణారహితంగా పురుగుమందులు వాడితే ఖర్చులు పెరగడంతో పాటు దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. వేసవి దుక్కులతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉంటాయని మండల వ్యవసాయధికారి నిర్మలాదేవి సూచిస్తున్నారు.



వేసవి దుక్కులు దున్నుతున్న రైతు

పంట అవశేషాలు తొలగింపు

గత పంట తాలూకా అవశేషాలను పూర్తిగా తొలగిస్తే కొన్ని పురుగుల కొశస్థ దశలను నాశనం చేసిన తర్వాత సాగు చేసే పంటకు పురుగులు ఆశించకుండా చేయవచ్చు. ముఖ్యంగా వరి పంటలో ప్రధానమైన కాండం తొలిచే పురుగును నియంత్రివచ్చు.

వర్షా కాలానికి ముందే దున్నాలి

వర్షాకాలం కాలం రాక ముందు భూమి మూడు దుక్కలు దున్నాలి. ఇలా చేస్తే తొలకరి వర్షాలకు నేల మెత్తబడి భూమిలోకి నీళ్లు ఇంకుతాయి. దుక్కులు లోతుగా అడ్డంగా, వాలుగా దున్నుకుంటే వర్షపు నీరు భూమిలోకి ఇంకి తేమను నిల్వ చేసే సామర్థ్యం పెరుగుతుంది. దుక్కి దున్ని భూమిని ఎండబెడితే కలుపు మొక్కలు నివారించవచ్చు. దుక్కులు దున్నే ముందు భూమిలో పశువుల పేడ, కంపోస్టు ఎరువులు, చెరువు మట్టిని వేయాలి. వేసవిలో దుక్కి దున్నితే భూమి గుల్లగా మారుతుంది. దీంతో భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరగడమే కాకుండా తేమలో జీవించే సూక్ష్మజీవులు, వానపాముల సంతతి వృద్ధి చెందుతుంది. ఇవి భూసార పరీక్షకు ఉపయోగపడతాయి.

లోతు దుక్కులతో పురుగులు నాశనం

వరిలో కాండం తొలుచు పురుగు, రెప్పవాల్చు పురుగు, లద్దె పురుగులు, పత్తిలో లద్దె పురుగులు, శనగపచ్చ పురుగులు, మిరప, టమెటా, కూరగాయ మొక్కల్లో కాయ తొలుచు పురుగు లోతు దుక్కులు వేస్తే నశిస్తాయి.

కలుపు మొక్కల నివారణ

వేసవిలో లోతు దుక్కులు దున్నితే కలుపు మొక్కలు నివారించవచ్చు. పంట కాలం ముగిశాక భూములను ఖాళీగా ఉంచితే పంటలను ఆశించే చీడపురుగులు, తెగుళ్లను కలగచేసే శిలీంద్రాలు భూమి పొరల్లో ఆశ్రయం పొందుతాయి. దుక్కులు వేస్తే చీడ పురుగుల గుడ్లు, అవశేషాలు వెలుపలికి వచ్చి బయట ఉష్ణోగ్రతలకు చచ్చిపోతాయి.

ఖర్చు తగ్గించుకోవాలి

కేవలం ఒక పంటకు లక్షల ఖర్చు పెట్టడం కన్నా చక్కటి యాజమాన్య పద్ధతి పాటిస్తే సాగుకు అయ్యే ఖర్చు తగ్గించుకోవచ్చు. సాగుకు ముందే భూసార పరీక్ష చేయించుకుంటే వాటికి అనుగుణంగా సూక్ష్మపోషకాలను వినియోగించుకోవచ్చు. మొలకలు నాటిన అనంతరం చీడపీడల నివారణ కోసం లక్షలు ఖర్చు చేయకుండా వేపనూనె, పంచగవ్యలతో పంటలు సాగు చేసే తెగుళ్ల సోకకుండా ముందస్తు చర్యలు చేపట్టవచ్చు. వేసవిలో నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని బిందు సేద్యం పాటించడం ప్రయోజనకరం.


వేసవి దుక్కి దున్నిన చేను

> **భూసారం పెరుగుతుంది:**
> వేసవి దుక్కులు చేసుకుంటే భూమిలో ఉన్న చీడపురుగు గుడ్లు బయట పడి కీటకాలు నశిస్తాయి. దీంతో పురుగు మందుల వాడకం తగ్గి వాతావరణ కాలుష్యం కూడా ఉండదు. పంటలు కోతైన తర్వాత వాలుకు అడ్డంగా వేసవి దుక్కులు చేయాలి. నీరు ఇంకి పోవడంతో భూమి సారవంతంగా ఉంటుంది. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలి. రైతులు ఈ విషయాలు గమనించి వ్యవసాయం చేస్తే మంచి లాభాలు వచ్చే అవకాశం ఉంది.
> నిర్మలాదేవి, ఏఓ, పుల్లలచెరువు

ప్రవీణ్ పగడాల మృతిపై దర్యాప్తు చేపట్టాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాస్టర్స్ ఐక్య వేదిక నాయకులు

త్రిపురాంతకం: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్రంగా దర్యాప్తు చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని స్థానిక పాస్టర్స్ ఐక్య వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పాస్టర్లు, విశ్వాసులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పాడ్డారు. వారు మోకాళ్ల ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల గత నెల 24వ తేదీన హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం మోటారు బైక్‌పై బయల్దేరిన ఆయన అనుమానాస్పదంగా మృతి చెందారని చెప్పారు. ప్రభుత్వం, పోలీసు శాఖ ఆయన మృతిపై దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి అక్కడ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. పాస్టర్స్ ఐక్యవేదిక నాయకులు పల్లెపోగు జాన్ డగ్లస్, శామ్యూల్, రవికిరణ్, ప్రశాంత్, అశోక్, సంజీవ్, జాన్‌పాల్, సిమోన్ రాజ్, విల్సన్, హనోక్ పాల్గొన్నారు.

రైతులు అందుబాటులో ఉండాలి

బేస్తవారిపేట: భూముల రీ సర్వే సమయంలో రైతులు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ జితేంద్రకుమార్ సూచించారు. బుధవారం మండలంలోని జేబీకే పురంలో రీ సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జేబీకే పురంలో 966 ఎకరాల్లో రీసర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూమి 461 ఎకరాలు, ప్రైవేట్ భూమి 504 ఎకరాలు ఉందని వివరించారు. గురువారం నుంచి ప్రభుత్వ భూమి సర్వే జరుగుతుందన్నారు. రైతులు భూమి హక్కు పత్రాలు సర్వే సమయంలో అందజేయాలని కోరారు. గ్రామంలో రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ షేక్ సలీమ్‌బాషా, సర్వేయర్ కె.నాగేశ్వరరెడ్డి, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ జితేంద్రకుమార్

డీప్‌బోర్‌కు మరమ్మతులు


డీప్‌బోర్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

తాళ్లూరు: మండలంలోని బెల్లంకొండవారిపాలెం ఎస్సీ కాలనీలో డీప్‌బోర్ మోటార్ మరమ్మతులు గురై అక్కడి కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు సర్పంచ్ పోశం సుమలత శ్రీకాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎండాకాలం దృష్ట్యా వెంటనే స్పందించి సర్పంచ్ మరమ్మతులు చేపట్టి కాలనీ వాసులకు నీటి సమస్య లేకుండా చేశారు. సర్పంచ్ పనితీరుపై కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ప్రత్యేక సలహా సమావేశం

దర్శి (కురిచేడు): స్థానిక చౌటపాలెం రోడ్డులోని సీయోను ప్రార్థన మందిరంలో ఆలిండియా క్రిస్టియన్ చర్చ్ కౌన్సిల్ సభ్యులతో ప్రత్యేక సలహా సమావేశం నిర్వహించనున్నట్లు సంఘ కాపరి జాన్ పాస్టర్, ఆదాంబాబు తెలిపారు. సలహా సమావేశ కూడికకు పాస్టర్లు,సేవకులు, అన్ని సంఘాల నాయకులు, దళిత సంఘాల నాయకులు, క్రైస్తవ సహోదరి, సహోదరులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని మారెళ్ల పొలాల్లో ఓ రైతు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైంది. బాధిత రైతు గాలం శ్రీను కథనం ప్రకారం.. పంటలను కాపాడుకునేందుకు బోరు వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శ్రీను ఏర్పాటు చేసుకున్నాడు. ఎండలు మండుతుండటంతో పంటలు కాపాడుకునేందుకు బోరును వినియోగిస్తున్నాడు. బుధవారం యథావిధిగా పొలం వద్దకు వెళ్లే సరికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కిందపడేసి పగలగొట్టి ఉండటం గమనించాడు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని తీగను చోరీ చేసినట్లు గమనించి విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు శ్రీను తెలిపాడు.

ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ వార్షికోత్సవం


సర్టిఫికెట్లతో ఎన్‌సీసీ విద్యార్థులు

దొనకొండ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్పోర్ట్స్, ఎన్‌సీసీ వార్షికోత్సవం ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి ఎన్.సాంబశివరావు, కెనరా బ్యాంక్ మేనేజర్ జి.వెంకటేశ్వర్లు, బీసీ వసతి గృహ సంక్షేమాధికారి సురేష్ హాజరయ్యారు. క్రీడాకారుల గురించి, వారు సాధించిన పతకాల గురించి ఫిజికల్ డైరెక్టర్ కె.నరసింహారావు వివరించారు. ఈ సంవత్సరం దొనకొండ పాఠశాల నుంచి 47 క్రీడాంశాల్లో బాల బాలికలు పాల్గొన్నట్లు చెప్పారు. ఐదుగురు విద్యార్థులు జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఈ సంవత్సరం దొనకొండ పాఠశాలను స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డుకు విద్యాశాఖ ఎంపిక చేసిందని, జిల్లాలో క్రీడా రంగంలో ద్వితీయ స్థానం సాధించినట్లు నరసింహారావు తెలిపారు. పాఠశాల నుంచి విద్యార్థులు రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో పాల్గొనటం, పాఠశాలకు మంచి పేరు రావటం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు తెలిపారు. పాఠశాలలో ఎన్‌సీసీ ఈవెంట్ ప్రారంభించి మొదటి బ్యాచ్ ఏ సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో సంవత్సరానికి 100 మంది ఎన్‌సీసీ ట్రైనింగ్ తీసుకోవచ్చని, ఎన్‌సీసీ ఉన్నత విద్యకు, ఉద్యోగానికి, క్రమశిక్షణకు ఉపయోగపడుతుందని, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నరసింహారావును జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావటం పాఠశాలకు గర్వకారణమని, ఎన్‌సీసీ ప్రగతిలో సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ఎంఈఓ అభినందనలు తెలిపారు. క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. అనంతరం ముఖ్య అతిథులను సన్మానించారు.

రేపు నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

కురిచేడు: స్థానిక దొనకొండ రోడ్డులోని నాగార్జున సాగర్ కాలువ మూలమలుపులో వేంచేసి ఉన్న శ్రీ నిదానంపాటి లక్ష్మి అమ్మ వారి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరగనుంది. మండలంలోని భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి వద్దకు వచ్చి మొక్కులు చెల్లించుకోనున్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదానం, తాగునీరు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. ప్రస్తుతం పల్నాడు జిల్లా దుర్గి మండలం అడిగొప్పల సమీపంలోని నిదానంపాడు గ్రామంలో శ్రీ లక్ష్మి అమ్మవారు వెలసింది. పార్వతీదేవి శాప ఫలంతో శ్రీ లక్ష్మి అమ్మవారిగా యాగంటి రామయ్య, సుగుణమ్మ దంపతులకు 15వ శతాబ్దంలో జన్మించింది. అప్పటి నుంచి గ్రామ గ్రామా పూజలందుకుంటూ గ్రామాల్లో వెలసి భక్తుల పాలిట కొంగు బంగారమై కోరిన కోర్కెలు తీర్చుతోంది.


నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారు

చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వాసవీ వనిత క్లబ్ సభ్యులు

దర్శి (కురిచేడు): దర్శి: వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. డిపోలో వివిధ గ్రామాల నుంచి వచ్చి బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు క్లబ్ ప్రతినిధులు తెలిపారు. దర్శినాపురి వాసవి వనిత క్లబ్ రీజియన్ చైర్మన్ మునగా ఆంజనేయులు, గౌరవ అధ్యక్షురాలు మునగా నీలిమ, ప్రెసిడెంట్ దేసు సంధ్యారాణి, కార్యదర్శి కొల్లూరి సుశీల, కోశాధికారి తెల్లాకుల సత్యలక్ష్మి, కొల్లా సుజాత, ఆర్ఎస్, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ ట్రెజరర్ మునగా మహాలక్ష్మి, అనుప్రియ చలివేంద్రం ప్రారంభించారు.

పేదల ఇళ్ల స్థలాల కబ్జాకు టీడీపీ నేతల ప్రయత్నం

- తహసీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారుల ఆందోళన

మార్కాపురం: మార్కాపురం మండలం రాయవరం వద్ద 2009లో పేద ప్రజలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను రాయవరం గ్రామానికి చెందిన టీడీపీ నేత, మాజీ సర్పంచ్ కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని లబ్ధిదారులు బుధవారం మార్కాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. సదరు టీడీపీ నేత దొంగ పాసుబుక్కులు తయారు చేసుకునేందుకు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని, అతని మాటలు నమ్మి అధికారులు తమ పట్టాలు రద్దు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సదరు టీడీపీ నేత పేదల స్థలాలపై కన్నేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ కళాశాలకు దగ్గరగా తమ స్థలాలు ఉండటంతో వాటిని కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో షేక్ షఫీ, పురుషోత్తం, రఘు, మస్తాన్, రవికుమార్, ఖాదర్‌బాషా, గౌస్, ఏసేబు, రజియా తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు


ఉన్నగురువాయిపాలెం పొలాల్లో విద్యుత్ స్తంభానికి అల్లుకుపోయిన తీగజాతి మొక్కలు


అన్నవరం పొలాల్లో విద్యుత్ టాన్స్‌ఫార్మర్ పరిస్థితి ఇదీ..

అల్లుకున్న నిర్లక్ష్యం!

పొదిలి రూరల్: మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. ఉన్నగురువాయిపాలెం మద్యం దుకాణం సమీపంలోని పొలాలు, తుమ్మగుంట, గురుగుపాడు పొలాల్లో, అన్నవరం, ఆముదాలపల్లి పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలకు తీగజాతి మొక్కలు అల్లుకుపోయాయి. విద్యుత్ శాఖ సిబ్బంది, అధికారులు పట్టించుకోకపోవడంతో ఈదురుగాలు వీచినప్పుడల్లా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని రైతులు చెబుతున్నారు. వర్షం కురిసే సమయంలో తీగ జాతి మొక్కలకు విద్యుత్ సరఫరా అయితే మనుషులు, జీవాలకు ప్రాణాపాయం తప్పదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


తుమ్మగుంట పొలాల్లో స్తంభంపై ఎండిన మొక్కలు

విద్యుత్ లైను ప్రారంభం

కొనకనమిట్ల: మండలంలోని పొదిలి రోడ్డులో చిన్నారికట్ల సబ్‌స్టేషన్ వరకూ ఏర్పాటు చేసిన 33/11 కేవీ విద్యుత్ లైనును విద్యుత్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు ప్రారంభించారు. సుమారు రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన లైన్‌ను ప్రారంభించారు. దీని వలన కొనకనమిట్ల, చౌటపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు లోఓల్టేజీ సమస్య తీరనుందని ఈఈ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో డీఈ ఏ వీరయ్య, హరిబాబు, ఏఈ వీరబ్రహ్మం సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు